# రాబడి

## నిఫ్టీ టాప్‌అవుట్ సంకేతాలు

**మార్కెట్ పల్స్**

**గత** కాలమ్‌లో సూచించిన రీతిలోనే ఎన్ ఎస్‌ఈ నిఫ్టీ పటిష్ఠంగా బౌన్స్‌కావడమే కాదు.. వారంలో చివరిరోజున 22.127 పాయింట్ల వద్ద మరో కొత్త రికార్డుస్థాయిని నెలకొల్పింది. అయితే అక్కడ్నుంచి వేగంగా తగ్గి 21,854 పాయింట్ల వద్ద నిలిచింది. వారం మొత్తం మీద 501 పాయింట్లు లాభపడింది. కేంద్ర ఆర్థిక మంత్రి సమర్పించిన మధ్యంతర బడ్జెట్లో ద్రవ్యలోటు అంచనాను 5.8 శాతానికి తగ్గించడంతో పాటు వచ్చే ఏడాదికి ఆ లోటు 5.1 శాతంగానే ప్రతిపాదించడం, ప్రభుత్వ రుణ సమీకరణ లక్ష్యాన్ని తగ్గించడం వంటి అంశాలు ఇన్వెస్టర్లను ఆకట్టుకోవడంతో శుక్రవారం నిఫ్టీ పెద్ద ర్యాలీ జరపగలిగింది. కానీ అదే రోజున రికార్డు గరిష్ఠం నుంచి మెజారిటీ లాభాల్ని కోల్పోవడం టాప్‌అవుట్‌కు సంకేతమని ఇండియాచార్ట్స్ వ్యవస్థాపకుడు రోహిత్ శ్రీవాస్తవ చెప్పారు. శుక్రవారం నాటి కనిష్ఠస్థాయి 21,805 దిగువన ముగిస్తే స్వల్ప కాలిక మార్కెట్ ట్రెండ్ రివర్స్ అయినట్టు పరిగణించవచ్చన్నారు. ఒక రోజున టెక్నికల్ చార్టుల ఆధారంగా ట్రెండ్‌ను అంచనా వేయలేమని, ఈ సోమవారంనాటి కదలికల్ని పరిశీలించాల్సి ఉందని యాక్సిస్ సెక్యూరిటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ వివరించారు.

**కీలక స్థాయి 21,805**

ఈ సోమవారం నిఫ్టీ వ్యవహరించే శైలి రానున్న ట్రెండ్‌కు కీలకమని టెక్నికల్ అనలిస్టులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 21,805 పాయింట్ల దిగువన సూచీ ముగిస్తే బలహీనపడుతుందని, ఎగువన క్లోజ్ అయితే మరో కొత్త రికార్డును సృష్టించే ఛాన్స్ ఉందని అంచనా వేస్తున్నారు. 21,805పైన నిఫ్టీ రానున్న కొద్ది రోజుల్లో 22,300 పాయింట్లను అందుకుంటుందని, అటుపై 22,500 వరకూ పెరిగే అవకాశం ఉందని రాజేశ్ పాల్వియా విశ్లేషించారు. స్వల్ప కాలిక ఇన్వెస్టర్లు 21, 650 పాయింట్ల స్థాయిని స్టాప్‌లాస్‌గా నిర్దేశించుకోవాలని సూచించారు. నిఫ్టీ 21,805పైన ముగిస్తే మరో కొత్త గరిష్ఠస్థాయి 22,350 పాయింట్లను చేరవచ్చని రోహిత్ శ్రీవాస్తవ అంచనా వేశారు. ఈ వారం నిఫ్టీకి 21,500, 21,200 స్థాయిల వద్ద మద్దతు లభిస్తుండగా, 22,222, 22,350 స్థాయిలు అవరోధం కల్గించవచ్చని సామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోదీ సాంకేతిక అంచనాల్ని వెల్లడించారు.

# సొంతిల్లు.. ఏది బెటర్

## నిర్మాణంలో ఉన్నదా? పూర్తయినదా?

*సొంతిల్లు మనలో ప్రతి ఒక్కరికీ ఓ కామన్ ఎమోషన్, సోషల్ స్టేటస్. ఉద్యోగంలో స్థిరపడగానే మొదటగా ఆలోచించే ఫస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్ సొంతింటి కల నేరవేర్చుకోవడమే. అయితే ధర కాస్త ఎక్కువ పెట్టైనా గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న (రెడీ టు మూవ్) ఇంటికి వెళ్దామా.. నాలుగు రోజులు లేటైనా కాస్త తక్కువ ధరకు దొరికే అండర్ కన్‌స్ట్రక్షన్ ప్రాపర్టీ తీసుకుందామా అనే దైలమా చాలామందిలో ఉంటోంది. ఇందులో ఉండే ప్లస్, మైనస్ ఏంటో ఒకసారి చూద్దాం.*

### నిర్మాణంలో ఉన్న నివాసం

నిర్మాణంలో ఉన్న ప్రాపర్టీ సాధారణంగానే కాస్త రేటు తక్కువగా ఉంటుంది. ఎందుకంటే బిల్డర్‌కు నిధుల కొరత ఉంటుంది కాబట్టి మీరిచ్చే డౌన్ పేమెంట్, బ్యాంకులిచ్చే మైల్ స్టోన్ పేమెంట్‌లతోనే వాళ్ల బడ్జెట్ కొద్దిగా తగ్గుతుంది. అందువల్ల తక్కువకే మీకు ఇల్లు లభిస్తుంది. రెడీ టు ఆక్యుపై వాటితో పోల్చితే కనిష్ఠంగా 10 శాతం నుంచి గరిష్ఠంగా 30 శాతం వరకూ ధరలో తేడా ఉండొచ్చు. ఇదే మీకు బాగా కలిసొచ్చే అంశం, టెంప్టింగ్ పాయింట్ కూడా. ఇందులో కాస్త పెద్ద ప్రాపర్టీ కొనేందుకు కూడా అవకాశాలు ఎక్కువే. ప్రీ-ఈఎంఐ చెల్లిస్తారు కాబట్టి వడ్డీ భారం సైతం తక్కువగానే ఉంటుంది. గృహ రుణంపై ఇక్కడ ఇంట్రెస్ట్ మాత్రమే చెల్లిస్తారు.. అసలు చెల్లించరు. ఇక నిర్మాణం జరుగుతోంది కనుక మీ అభిరుచికి తగ్గట్టు మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే కట్టిన ఇంట్లో ఇదంతా చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. బిల్డింగ్ నిర్మాణం ఎలా అవుతోంది.. మెటీరియల్ ఏం వాడుతున్నారు.. వర్క్ ఎంత క్వాలిటీగా ఉందని మీరు ప్రత్యక్షంగా గమనించవచ్చు.

**ఇక సమస్యలివి..**

- డెవలపర్ ఆర్థిక స్థోమతపై మనకు క్లారిటీ ఉండదు.
- అనుకున్న సమయానికి నిర్మాణం పూర్తవుతుందనే కచ్చితమైన భరోసా లేదు.
- నిర్మాణ, పర్యావరణ సంబంధ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వంటి వాటిల్లో జాప్యం జరుగవచ్చు. ఒక్కోసారి ఊహించిన దానికంటే చాలా ఆలస్యం కావచ్చు. ఇది ఆర్థికంగా మనపై ప్రభావాన్ని చూపిస్తుంది.
- నిర్మాణం ఆలస్యమైతే అటు అద్దె కట్టుకోవాలి, ఇటు ఈఎంఐలు చెల్లించాలి. ఇది మానసిక ఒత్తిడికి దారితీయవచ్చు.

### పూర్తయిన ఇల్లు

సాధారణంగానే ఈ ఇండ్లు ధర ఎక్కువగా ఉంటాయని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. నిర్మాణంలో ఉన్న ఇల్లు లేదా ఫ్లాట్.. ఎస్ఎఫ్‌టీ రూ.5,500 ఉంటే, ఇది రూ.6,500/7,000 వరకూ ఉండొచ్చు. అయితే ఎలివేషన్, డిజైన్, నిర్మాణ నాణ్యత అన్నీ మనకు నచ్చితేనే ఎంపిక చేసుకోవచ్చు. కండ్ల ముందు ప్రాపర్టీ కనిపిస్తోంది కాబట్టి మనకు మరింత నమ్మకం కలుగుతుంది. వెంటనే చేరిపోయే అవకాశంతో పాటు ఈఎంఐలో అద్దె నగదు భర్తీ వల్ల భారం ఉండదు. ట్యాక్స్‌పేయర్లు పన్ను మినహాయింపులు, ప్రోత్సాహకాలను వెంటనే పొందవచ్చు.

### ఇదీ సంగతి..

రెడీ టు మూవ్ ఇండ్లను కొన్నవారిలో మెజారిటీ కొనుగోలుదారుల నుంచి ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నిర్మాణంలో నాణ్యతా వైఫల్యాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బిల్డర్ల అత్యాశ కొంపముంచుతున్నది. ఇండ్లు కడుతున్నప్పుడు నాసిరకం మెటీరియల్ వాడటం, అరకొర వాటర్ క్యూరింగ్ ప్రాసెస్, అగ్గువకే దొరికే వైరింగ్, విద్యుత్తు సామాగ్రి ఫిట్టింగ్, ఫ్లోరింగ్, ప్లంబింగ్, శానిటరీ ఉత్పత్తులను వాడుతుండటం సమస్యల్ని తెచ్చిపెడుతున్నది. దీంతో ఇల్లు కొన్నప్పుడు బాగానే ఉన్నా.. కొద్ది నెలలకే గోడలకు తేమ రావడం, పగుళ్లు ఏర్పడటం జరుగుతున్నాయి. వర్షాకాలంలో శ్లాబులో నుంచి నీరు కారుతుండగా.. ఎండాకాలంలో ఓవర్ లోడ్‌తో విద్యుత్తు వైరింగ్ ఫెయిలైపోవడం ఇబ్బందికర పరిస్థితుల్ని తెచ్చిపెడుతున్నది. కాలంతో సంబంధం లేకుండా వాటర్ పైపుల లీకేజీలు ఉండనే ఉంటున్నాయి. కానీ నిర్మాణంలో ఉన్న ఇండ్ల విషయంలో ఈ తరహా సమస్యల్ని కొనుగోలుదారులు అధిగమించగలుగుతున్నారు. కాకపోతే సరైన బిల్డర్ దొరక్కపోతే నిర్మాణ సమయం పెరిగి అనవసరపు ఆర్థిక ఇబ్బందుల్ని మాత్రం చవిచూడాల్సి వస్తున్నది. మొత్తానికి సమయం ఉంటే సరైన పర్యవేక్షణతో నిర్మాణంలో ఉన్న ఇండ్లనే కొనేందుకు మొగ్గు చూపాలన్నది మెజారిటీ నిపుణుల మాట. నమ్మకమున్న, తెలిసిన బిల్డర్ల దగ్గర్నుంచో, పేరున్న సంస్థల ప్రాజెక్టుల నుంచో కొనుక్కోవడం ఉత్తమం. -

***నాగేంద్రసాయి కుందవరం***

**ప్రతికూలతలు**

- ధర ఎక్కువపెట్టి కొనాలి.
- కొన్నిసార్లు చిన్న ప్రాపర్టీకి కూడా స్థలం విషయంలో రాజీపడాల్సి రావచ్చు.
- నిర్మాణానికి పట్టిన సమయం తెలియదు.
- ఏ మెటీరియల్ వాడారో చూడలేం.
- ఇంటీరియర్ క్వాలిటీనీ నమ్మలేని పరిస్థితి.

## కొత్త కార్ల రుణాలపై వడ్డీరేట్లు, చార్జీలు

| బ్యాంక్ | వడ్డీరేటు (శాతంలో) | ఐదేండ్లు, 5 లక్షల రుణంపై ఈఎంఐ | ప్రాసెసింగ్ ఫీజు (రూ.లో) |
|---|---|---|---|
| యూనియన్ బ్యాంక్ | 9.15-10.45 | 10,416-10,735 | 1,000 |
| పంజాబ్ నేషనల్ బ్యాంక్ | 8.75-10.60 | 10,319-10,772 | 1,000 నుంచి 1,500 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 8.75-12.70 | 10,319-11,300 | 10 వేల వరకు |
| కెనరా బ్యాంక్ | 8.70-11.95 | 10,307-11,110 | 750 నుంచి 1,500 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 8.75-10.75 | 10,319-10,809 | సున్నా |
| ఎస్బీఐ | 8.75-9.80 | 10,319-10,554 | సున్నా |
| బీవోఎం | 8.70-13 | 10,307-11,377 | సున్నా |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 9.10 ప్రారంభంతో | 10,403 ప్రారంభంతో | 999 నుంచి 8,500 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 8.75 ప్రారంభంతో | 10,319 ప్రారంభంతో | 3,500 నుంచి 8,000 |

## కారుపై బ్యాంకుల్లో వడ్డీలివే

**నూతనంగా** కారు కొనుగోలు చేయాలనుకుంటున్నారా అయితే ఈ వార్త మీకోసమే. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీకి కారుపై రుణాలు ఇస్తున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. రవాణా చార్జీలు తడిసిమోపెడు అవుతున్న ప్రస్తుత తరుణంలో కుటుంబానికి కారు అత్యవసర వస్తువుగా మారిపోయింది. ఈ నూతన సంవత్సరంలో కారుపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీకి రుణాలు ఇస్తున్నారో, ప్రాసెసింగ్ ఫీజు ఎంత వరకు వసూలు చేస్తున్నారు పాలసీబజార్.కామ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రభుత్వరంగ సంస్థ యూకో బ్యాంక్ అతి తక్కువ వడ్డీ 8.45 శాతానికి కారుపై రుణాలు మంజూరు చేస్తున్నది. అలాగే పలు బ్యాంకులు ప్రాసెసింగ్ ఫీజులను సైతం ఎత్తివేశాయి. వీటిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్, ఎస్బీఐ, బీవోఎంలు ఉన్నాయి.

## పీఎంఎఫ్ రాబడులు భళా

**పోర్ట్‌ఫోలియో** మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కింద ఉన్న ఫండ్లు (పీఎంఎఫ్) మదుపరులకు ఆకర్షణీయమైన రాబడులను పంచుతున్నాయి. 75 శాతానికిపైగా ఫండ్స్.. గడిచిన పదేండ్లలో మ్యూచువల్ ఫండ్స్‌ను మించి హై నెట్‌వర్త్ ఇండివీడ్యువల్స్ (హెచ్ఎన్ఐ)కు ఆదాయాన్నిచ్చాయి మరి. దీంతో బడా ఇన్వెస్టర్లు ఈ రకమైన పెట్టుబడులను ఓ లుక్కేయవచ్చని మార్కెట్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. నిపుణుల చేతిలో మీ పెట్టుబడులుండటం ఈ పీఎంఎఫ్ ప్రయోజనాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. మార్కెట్ ఒడుదొడుకుల్ని తట్టుకుని మదుపరుల పెట్టుబడుల్ని ఎలా లాభాల బాట పట్టించాలో వీటిల్లో ప్రయోగాత్మకంగా ప్రొఫెషనల్స్ చేసి చూపిస్తున్నారు. ఇక్కడి పోర్ట్‌ఫోలియో మేనేజర్లు మదుపరుల ప్రధాన ఆర్థిక లక్ష్యాలకు తగ్గట్టుగా రిటర్నులను రాబడుతున్నారు. అందుకే హై నెట్‌వర్త్‌తో ఉన్న ఇన్వెస్టర్లు, పెట్టుబడులపై అంతగా అవగాహనలేనివారు, పెట్టుబడులను పరిశీలించడానికీ తీరికలేనివారు, మార్కెట్ ఒడుదొడుకుల నుంచి రక్షణను పొందాలనుకునేవారు పీఎంఎఫ్‌ల్లో పెట్టుబడులను ఎంచుకోవడమే తెలివైన పని అన్నది మెజారిటీ నిపుణుల వాదన కూడా. 1, 3, 5, 10 ఏండ్ల వ్యవధిలో 388 రెగ్యులర్ మ్యూచువల్ ఫండ్స్, 335 పీఎంఎస్ ఫండ్ల ప్రదర్శనల్ని పోల్చిచూస్తే అన్ని కేటగిరీల్లో ఆకట్టుకునే స్థాయిలో సగటున 70 శాతం పీఎంఎఫ్‌లు అదరగొట్టాయి. మ్యూచువల్ ఫండ్స్‌ల్లో ఈ సగటు 48 శాతమే. లార్జ్, మిడ్, స్మాల్, లార్జ్-మిడ్, ఫ్లెక్సీ క్యాప్, మల్టీ క్యాప్ కేటగిరీల్లో చూసినా పోర్ట్‌ఫోలియో మేనేజర్ల చేతిలో ఉన్న ఫండ్స్ సురక్షితమేనన్న అభిప్రాయాలున్నాయి.

# మొబైల్ మైకం.. కండ్లకు శాపం

- దెబ్బ తింటున్న మానవ సంబంధాలు
- మందగిస్తున్న మెదడు, వెన్నెముక
- సెల్‌ఫోన్ బానిసల్లో 11-18 ఏండ్ల మధ్యవారే అధికం

*హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ):* నేటి సమాజంలో పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ముఖ్యంగా పిల్లలు ప్రతి దానికీ మారాం చేయడం.. వారికి తల్లిదండ్రులు మొబైల్ ఫోన్లు ఇచ్చి బుజ్జగించడం నిత్యకృత్యంగా మారింది. ఏ ఇంట్లో చూసినా పసిపిల్లలు మొదలుకొని పదేండ్ల పిల్లల వరకు మొబైల్ ఇవ్వకపోతే ముద్ద ముట్టడం లేదు. కానీ, ఇది మంచి పద్ధతి కాదని 'వన్ లైఫ్' స్వచ్ఛంద సంస్థ స్పష్టం చేసింది. సమాజంలో ఎక్కువగా *11-18* ఏండ్ల వయస్కులు ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు బానిసలుగా మారుతున్నట్టు వెల్లడించింది. అతిగా మొబైల్ మైకంలో పడితే కండ్లకు లేని సమస్యలను కొనితెచ్చుకున్నట్టేనని హెచ్చరించింది. తల్లిదండ్రులు చిన్న చిన్న చిట్కాలతో చిన్నారులను మొబైల్ నుంచి దూరం చేయాలని సూచించింది.

**దూరం చేద్దామిలా..**

రెండేండ్ల లోపు చిన్నారులకు ఫోన్లు, ట్యాబ్‌లు, ఇతర గ్యాడ్జెట్లు ఇవ్వకూడదు. వారు తల్లిదండ్రులు లేదా తోబుట్టువుల సంరక్షణలోనే ఉండాలి. *5-17* ఏండ్లలోపు పిల్లలు రోజులో *2* గంటలకు మించి ఫోన్ ఉపయోగించకుండా చూడాలి. మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయిన పిల్లలపై తల్లిదండ్రులు కేకలు వేయడం, అరవడం సమస్యకు పరిష్కారం కాదు. ముందు వారికి సెల్‌ఫోన్‌ను దూరం చేయడంపై దృష్టి సారించాలి. అందులో భాగంగా ఇంట్లో పిల్లలతో చిన్నపాటి చర్చలు, ఇతర కార్యక్రమాలు చేపట్టాలి. వారు ఆటలకు అంకితమయ్యేలా చూడాలి. కొత్త అభిరుచులను అలవాటు చేయాలి. వారిలోని సృజనాత్మక ఆలోచనలను వెలికితీసి, వాటికి కార్యరూపమిచ్చేలా ప్రోత్సహించాలి. పడుకునే ముందు పిల్లలకు ఫోన్లు ఇవ్వరాదు. వారంలో ఒక రోజు ఫోన్ లేకుండా తినే రోజుగా (నో ఫోన్‌డేగా) పాటించాలి. స్టడీ అవర్స్‌లో సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలి. రంగులు వేయడం, పెయింటింగ్, చెట్లు ఎక్కడం, సైక్లింగ్, గార్డెనింగ్, పార్కులకు తీసుకెళ్లడం, ఫ్రెండ్స్‌తో నిత్యం కలవడం, సైన్స్ ప్రయోగాలు నిర్వహించడం ద్వారా ఫోన్ల వాడకాన్ని తగ్గించవచ్చు.

**అనర్థాలు అనేకం**

- అతిగా ఫోన్లు వీక్షించడం వల్ల దృష్టి లోపాలు తలెత్తుతాయి. కంటిచూపు మందగిస్తుంది. మానసికంగా బలహీనపరుస్తుంది. అతిగా స్పందించే తత్వాన్ని పెంచుతుంది.
- ఫోన్లకు అతుక్కుపోవడం వల్ల మానవ సంబంధాలు దెబ్బతింటాయి. సామాజిక నైపుణ్యాలపైనా దుష్ప్రభావం పడుతుంది.
- చదువు మందగిస్తుంది. దూకుడు స్వభావం పెరుగుతుంది.
- చిరాకు, మానసికస్థితిలో మార్పులు, నిద్రలేమి, తలనొప్పి, నిరాశ, ఆందోళన తదితర సమస్యలు వ్యసనాలకు దారితీస్తాయి.
- స్క్రీన్ టైమ్ అధికమైతే కండ్లతోపాటు వెన్నుపూస, మెదడు పనితీరు మందిగిస్తుంది.
- మొబైల్ స్క్రీన్ నుంచి వెలువడే నీలి రంగు కాంతి మెదడులో మెలటోనిన్‌ను ఉత్పత్తిని నిరోధిస్తుంది. దీంతో మెదడు నిద్రపోతుంది. ఇది ఏకాగ్రతను దెబ్బతీస్తుంది.

### పిల్లలున్నదే డిజిటల్ ప్రపంచంలో

నేటి తరం పిల్లలు డిజిటల్ ప్రపంచంలో పెరుగుతున్నారు. మొబైల్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు వారి జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ఉపకరణాల వినియోగంతో చిన్నారుల కండ్లు, మెదడు పనితీరు దెబ్బతింటున్నది. దీంతో ఒబేసిటీ (ఊబకాయం), నిద్రలేమి, మానసిక సమస్యలు తలెత్తి చదువుల్లో వెనకబడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ఆరిస్తే లాభముండదు. ఆలోచనలకు పదునుపెట్టి వారి నుంచి స్మార్ట్‌ఫోన్లను దూరంచేయాలి. ఇతర అలవాట్ల పట్ల ఆకర్షితులయ్యేలా ప్రోత్సహించాలి. – *రెబెకా మారియా, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్*

*ఆరుగురు పద్మశ్రీ అవార్డు గ్రహీతలతోపాటు పద్మ విభూషణ్ పొందిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సినీనటుడు చిరంజీవిని రాష్ట్ర ప్రభుత్వం తరపున సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి*

# వ్యక్తిగత దూషణలకు వెళ్లం

- మాజీ ఉప రాష్ట్రపతి మాటను గౌరవిస్తాం
- ప్రతి పద్మశ్రీ గ్రహీతకు రూ.25 లక్షల సాయం
- నెలకు రూ.25 వేల పింఛను: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రాజకీయాల్లో, ప్రజాజీవితంలో విలువలకు కట్టుబడాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- రాజకీయాల్లో దుర్భాషలు సరికావు
- పద్మ అవార్డుల సన్మానంలో ప్రముఖ సినీనటుడు చిరంజీవి

కొండాపూర్/హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): 'ప్రజాప్రతినిధుల భాషపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పకనే కొన్ని అంశాలు చెప్పారు. నేను విద్యార్థి దశ నుంచి వారి దృష్టిలో ఉన్నా. అక్కడి నుంచి ఇక్కడిదాక నా రాజకీయ ఎదుగుదలను వారు చూస్తున్నారు. వారు అందరికీ చెప్పినట్టుగా భాష, భావం, ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో వేదిక మీద ఉన్న మాకందరికీ చెప్పారు. వారి మాటలను గౌరవిస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయ నాయకులపై వ్యక్తిగత దూషణలకు వెళ్లనని పరోక్షంగా చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పద్మశ్రీ అవార్డులు పొందిన ఆరుగురు, పద్మ విభూషన్ పొందిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవిని ఆదివారం శిల్పకళావేదిక సాక్షిగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో పద్మశ్రీ అవార్డులు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.25 లక్షల నగదు సాయాన్ని, ఖర్చుల కోసం నెలకు రూ.25 వేల పింఛను ఇస్తున్నట్టు ప్రకటించారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని, ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని ఆకాంక్షించారు. ఈసారి పద్మ అవార్డుల కోసం కేంద్రప్రభుత్వం మట్టిలో మాణిక్యాలను వెలికి తీసిందని వ్యాఖ్యానించారు. కవులు, కళాకారులు, ప్రతిభావంతులను సన్మాంచుకునే సంప్రదాయం కొనసాగాలని అన్నారు. తన అభిమాన నేత వెంకయ్యనాయుడిని భారత రాష్ట్రపతిగా చూడాలని సీఎం ఆకాంక్షించారు.

**వ్యక్తిగత విమర్శలు సరికావు**

ప్రస్తుత రాజకీయాల్లో విలువలు తగ్గిపోతున్నాయని, నిత్యం దుర్భాషలు పెరిగిపోతున్నాయని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో వెంకయ్యనాయుడుతో సహా ఎందరో రాజకీయ మేధావులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. రాజకీయాల్లో మాట పడటం, మాటలు అనడం మంచి పద్ధతి కాదని తెలిపారు. రాజకీయ విమర్శలు నచ్చుతాయి కానీ, వ్యక్తిగత విమర్శలు ఎప్పటికీ నప్పవని వెల్లడించారు. తాను చూసిన రియల్ స్టేట్స్‌మెన్ ఇన్ పాలిటిక్స్ అంటూ వెంకయ్యనాయుడి రాజకీయ ప్రస్థానాన్ని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డు ఇస్తామని ప్రకటించటం, వాటిని ప్రజాగాయకుడు గద్దర్ పేరున ఇస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నట్టు పేర్కొన్నారు. యాదగిరిగుట్ట ఆలయశిల్పి స్థపతివేలు ఆనందాచారి మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట ఆలయం గురించి ప్రపంచం గొప్పగా చెప్పుకుంటున్నదని, రెండో తిరుపతిగా పేరొందిందని ఆనందం వ్యక్తం చేశారు. కాగా, పద్మశ్రీ గ్రహీతలు ఆనందాచారి, తంత్రివాద్య కళాకారుడు దాసరి కొండప్ప, హరికథాగాయని ఉమామహేశ్వరి, చిందు, యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, బంజారా భాష లోకి భగవద్గీతను తర్జుమా చేసిన కళాకారుడు కేతావత్ సోమ్‌లాల్, గ్రంథాలయ వ్యవస్థాపకుడు కూరెళ్ల విఠాలాచార్యను ఘనంగా సన్మానించిన సీఎం.. రూ.25 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

**రాజకీయాలంటే దూషణలు కాదు**

ప్రస్తుతం రాజకీయాల్లో ఒకరినొకరు తిట్టుకోవడంతోనే సరిపోతున్నదని, ప్రజాజీవితంలో ఉన్నవారు విలువలు, ప్రమాణాలు పాటించాలని మాజీ ఉపరాష్ట్రపతి, పద్మవిభూషణ్ వెంకయ్యనాయుడు సూచించారు. అసెంబ్లీ సమావేశాలు గలాటాలకు కేంద్రంగా మారాయని చెప్పారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు మంచి ప్రవర్తనతో ఉండాలని సూచించారు. ఎమ్మెల్యేలు వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా, బూతులు తిట్టుకోకుండా పాలనపై దృష్టి పెట్టాలని తెలిపారు. బూతులు తిట్టేవారికి పోలింగ్ బూత్‌లలోనే సమాధానం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలుగు కళామతల్లికి రెండు కండ్లు ఎన్టీఆర్, ఏఎన్నార్ అయితే.. మూడో కన్ను మెగాస్టార్ చిరంజీవి అని ఈ సందర్భంగా ఆయన సేవ, కళను కొనియాడారు.


115 పేజీ తరువాయి..

| | | | | | |
|---|---|---|---|---|---|
| 622 | 640/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 122 (వందకు మీటర్లు) | 0.0122 |
| 623 | 547 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 12 (వందకు మీటర్లు) | 0.0012 |
| 624 | 548/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 1528 (వందకు మీటర్లు) | 0.1528 |
| 625 | 548/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 1740 (వందకు మీటర్లు) | 0.1740 |
| 626 | 657 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 293 (వందకు మీటర్లు) | 0.0293 |
| 627 | 658/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 402 (వందకు మీటర్లు) | 0.0402 |
| 628 | 658/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 692 (వందకు మీటర్లు) | 0.0692 |
| 629 | 663 | ప్రైవేట్ | పొడి | 60 (వందకు మీటర్లు) | 0.006 |
| 630 | 664/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 1882 (వందకు మీటర్లు) | 0.1882 |
| 631 | 664/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 2620 (వందకు మీటర్లు) | 0.262 |
| 632 | 665 | ప్రైవేట్ | పొడి | 1735 (వందకు మీటర్లు) | 0.1735 |
| 633 | 666/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 639 (వందకు మీటర్లు) | 0.0639 |
| 634 | 666/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 140 (వందకు మీటర్లు) | 0.0140 |
| 635 | 666/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 470 (వందకు మీటర్లు) | 0.0470 |
| 636 | 666/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 545 (వందకు మీటర్లు) | 0.0545 |
| 637 | 667 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 388 (వందకు మీటర్లు) | 0.0388 |
| 638 | 668 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 678 (వందకు మీటర్లు) | 0.0678 |
| 639 | 668/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 1254 (వందకు మీటర్లు) | 0.1254 |
| 640 | 668/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 1565 (వందకు మీటర్లు) | 0.1565 |
| 641 | 670 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 54 (వందకు మీటర్లు) | 0.0054 |
| 642 | 670 | ప్రైవేట్ | పొడి | 00 (వందకు మీటర్లు) | 0.000 |
| 643 | 677 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 740 (వందకు మీటర్లు) | 0.074 |
| 644 | 678/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 724 (వందకు మీటర్లు) | 0.0724 |
| 645 | 678/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 864 (వందకు మీటర్లు) | 0.0864 |
| 646 | 679 | ప్రైవేట్ | పొడి | 60 (వందకు మీటర్లు) | 0.006 |
| 647 | 680/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 1238 (వందకు మీటర్లు) | 0.1238 |
| 648 | 680/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 404 (వందకు మీటర్లు) | 0.0404 |
| 649 | 687/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 909 (వందకు మీటర్లు) | 0.0909 |
| 650 | 687/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 245 (వందకు మీటర్లు) | 0.0245 |
| 651 | 688 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 637 (వందకు మీటర్లు) | 0.0637 |
| 652 | 689/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 1069 (వందకు మీటర్లు) | 0.1069 |
| 653 | 689/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 711 (వందకు మీటర్లు) | 0.0711 |
| 654 | 690 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 559 (వందకు మీటర్లు) | 0.0559 |
| 655 | 944/1 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 1193 (వందకు మీటర్లు) | 0.1193 |
| 656 | 944/2 | ప్రైవేట్ (పట్టా) | పొడి | 587 (వందకు మీ